క్లుప్తంగా

29న వాహనాల వేలం

మదనపల్లె : మదనపల్లె స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) స్టేషన్ పరిధిలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాల్లో సీజ్‌చేసిన వాహనాలను ఈనెల 29న బహిరంగ వేలం వేయనున్నట్లు ఇన్‌చార్జ్ సీఐ శ్రీహరిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో త తెలిపారు. ఎస్‌ఈబీ స్టేషన్ ఆవరణలో జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సమక్షంలో బుధవారం ఉదయం 10గంటలకు సీజ్ చేసిన వాహనాలను బహిరంగ వేలంలో విక్రయిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు రుసుం చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ అంజాద్‌బాషాను సంప్రదించాలని తెలిపారు.

నవమి వేడుకలు ప్రారంభం

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం సొసైటీ కాలనీలోని శ్రీరామాలయంలో సోమవారం నవి బ్రహోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో అర్చకులు స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. సాయంత్రం స్వామిని గజవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో శ్రీరామసేవా ఉత్సవ కమిటీ పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ ఇద్దరు ఎంపిక

మదనపల్లె సిటీ: నేషనల్ మెరిట్ మీన్స్ కం మెరిట్‌స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు మదనపల్లె మండలం బసినికొండ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన కీర్తన, మమత అర్హత సాధించారని పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు తెలిపారు. గైడ్ టీచర్లు భాస్కరన్, అనిత అభినందించారు.

దాడి చేసిన మహిళలపై కేసు

కలకడ : మండలంలోని ఎనుగొండపాళ్యం పంచాయతీ కుమ్మరపల్లెకు చెందిన గుర్రంకొండ వెంకట్రమణ భార్య వెంకటలక్ష్మమ్మను అదే గ్రామానికి చెందిన గుర్రంకొండ రెడ్డెమ్మ, రెడ్డెమ్మ కుమార్తె లక్ష్మీదేవిలు ఈనెల 22తేదీన దుర్భాషలాడి కొట్టి గాయపరిచారు. వారి దాడిలో గాయపడిన వెంకటలక్ష్మమ్మను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో వాల్మీకిపురం ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్సకోసం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈదాడిపై సోమవారం వెంకట్రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెడ్డెమ్మ, లక్ష్మీదేవిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ రమేష్ తెలిపారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన

కలకడ : మహాభారత యజ్ఞ నాటకం తొలిరోజు భక్తులు, కళాకారులను ఆకట్టుకుంది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు శ్రీవెంకటేశ్వర నాట్య కళామండలి పీలేరు కళాకారులు శ్రీకృష్ణలీలలు నాటకం ప్రదర్శించారు. మహాభారతం విన్నవారికి పుణ్యప్రాప్తి కలుగుతుందని, రాజుల నీతి, పాపపుణ్యాల సారాంశం తెలుసుకునే అవకాశం ఉటుందని ఆలయ ధర్మకర్తలు రామయ్య, వెంకట్రమణ తెలిపారు.

గౌరమ్మతల్లికి ప్రత్యేక పూజలు



తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తున్నారు. సోమవారం కొండపై గౌరమ్మగుట్టలో వెలసిన గౌరమ్మతల్లికి పూజారి శేఖర్ ప్రత్యేక అలంకరణ చేసి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మహిళలు సంతానం కోసం అమ్మవారికి ప్రత్యేక మొక్కులు మొక్కారు. సంతానం కలిగితే స్వామి, అమ్మవారి పేర్లు పెట్టుకోవడం విశేషం. ఆలయంలో స్వామివారికి పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

నేడు వారపు సంత వేలం

పెద్దమండ్యం: మండలంలోని బండమీదపల్లె పంచాయతీలో మంగళవారం వేలం నిర్వహించనున్నట్లు సర్పంచ్ మొలక బయ్యారెడ్డి, కార్యదర్శి శైలజ తెలిపారు. గ్రామ సచివాలయంలో పంచాయతీ పరిధిలోని పసలబండ, వారపు సంతకు వేలం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ప్రభుత్వ నిబంధనల మేరకు ధరావత్తు చెల్లించాలన్నారు. ఎంపీడీఓ శ్రీధర్‌రావు పర్యవేక్షణలో వేలం నిర్వహిస్తామన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

పెద్దమండ్యం: పీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్ అన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అందుతున్న వైద్య సేవలపై సోమవారం ఎంపీడీఓతో కలిసి ఆయన మాట్లాడారు. ఇటీవల కుక్క కాటుకు గురై మండలంలోని తాటిమాకులపల్లె నుంచి వచ్చిన బాధితుడికి చికిత్స చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తమ దృష్టికి వచ్చినట్లు ఆయన తెలిపారు. బాధితుడు ఆసుపత్రికి వచ్చిన సమయంలో డ్యూటీలో ఉన్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకొన్నారు. కుక్కకాటుకు ఆసుపత్రిలో టీకా ఉన్నా బాధితుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై డాక్టర్ ఇమ్మాన్యుల్‌తో మాట్లాడి డ్యూటీలో ఉన్న నర్సుపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఎంపీటీసీ సభ్యులు ఎం. జయరాం, సీహెచ్‌ఓ క్రిష్ణయ్య పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించండి

- అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు
- పిల్లలు చెరువులు, కుటల వద్దకు వెళ్లనివ్వద్దు
- ఈ ఏడాది ఎండలు ఎక్కువ ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరిక
- వడదెబ్బ నివారణ చర్యలపై సచివాలయ సిబ్బందితో అధికారుల సమీక్ష



వేసవి ముందస్తు జాగ్రత్తలను వివరిస్తున్న తహసీల్దార్ సీకే శ్రీనివాసులు

మదనపల్లె : వేసవిలో ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో ఉదయం 10గంటల తర్వాత అత్యవసరమైతే తప్ప బయట తిరగవద్దని తహసీల్దార్ సీకే.శ్రీనివాసులు సూచించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ అధ్యక్షతన సోమవారం వేసవిలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, వడదెబ్బ నివారణ చర్యలపై గ్రామసచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఈ ఏడాది ఎండలు తీవ్రంగా ఉంటాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీచేస్తున్న నేపథ్యంలో వయస్సు మీరినవారు, గర్భిణులు, రోగులు, చిన్నపిల్లలు ఉదయం 10 తర్వాత ఇంటికే పరిమితమవ్వాలన్నారు. గ్రామాల్లో చెరువులు, నీటికుంటల్లో ఈత కొట్టేందుకు పిల్లలను వెళ్లనివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండలంలోని కోళ్లబైలు, పొన్నూటిపాళ్యం, బసినికొండ, కొత్తపల్లె-1,2 పంచాయతీల్లో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో దాతలు, వ్యాపారస్తుల సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. సీటీఎం, బొమ్మనచెరువు పీహెచ్‌సీ వైద్యులు సునీత, మహమ్మద్ ఫుర్ఖాన్‌ఖాన్, లక్ష్మీ మాట్లాడుతూ.. ప్రభుత్వం వడదెబ్బ నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో ఏఎన్‌ఎంల వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన వారికి పంపిణీ చేయాలన్నారు. తలతిరగడం, వాంతులు, విరేచనాలు, త్వరగా అలసిపోవడం తదితర లక్షణాలు కనిపించిన వెంటనే ఓఆర్‌ఎస్, కొబ్బరినీళ్లు తీసుకోవాలని, దగ్గరలోని పీహెచ్‌సీ, సబ్ సెంటర్‌కు వెళ్లి వైద్యసేవలు పొందాలన్నారు. వీలైనంతవరకు ఎండలో తిరగడం తగ్గించి, కాఫీ, ఆల్కహాల్ తదితర వాటికి దూరంగా ఉండాలని సూచించారు. సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని వలంటీర్ల సహాయంతో ఇంటింటికీ వెళ్లి వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రభుత్వం ముద్రించిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో ఎస్‌ఐ చంద్రమోహన్, ఈఓఆర్డీ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు

పీలేరు రూరల్ : రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని సరోజినీదేవి వీధిలో పేద ముస్లింలకు దారుల్ సలాం అహ్లే హదీస్ వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ చేశారు. సోమవారం ట్రస్టు సభ్యులు సుమారు 40 కుటుంబాలకు తోఫా అందజేశారు. ఒక్కో కుటుంబానికి ఒక బస్తా బియ్యం, 3 కేజీల గోధుమ పిండి, 1 కేజీ చక్కెర, 1 కేజీ సేమియా, 1 కేజీ రవ్వ, 2 లీటర్ల వంట నూనె చొప్పున ఒక్కొక్కరికి రూ.2200 విలువైన వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు అత్తార్ బోదేషా, యూసఫ్‌సాహెబ్ మాట్లాడుతూ పేద ముస్లింలు అందరితో సమంగా రంజాన్ పండుగ జరుపుకోవాలనే ఉద్దేశంలో సేవా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. షేక్ సలీమ్ బాషా, నూరు మొహమ్మద్, అక్బర్, ఫర్రాన్, ఫైజ్, మొహమ్మద్ హుస్సేన్, మహమ్మద్‌హుసన్ పాల్గొన్నారు.

రూ. 5 లక్షలతో కల్వర్టు నిర్మాణ పనులు



పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ హబీబ్‌బాషా

పీలేరు : పట్టణంలోని రాజీవ్ కాలనీలో రూ. 5 లక్షలతో కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టినట్లు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రాజీవ్‌నగర్ కాలనీలో స్థానికులు కల్వర్టు సమస్య గురించి ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఐదవ గ్రామ సచివాలయం పరిధిలో రాజీవ్ నగర్ కాలనీలో ఒకటి, మసీదు సమీపంలో ఒకటి రెండు కల్వర్టుల నిర్మాణ పనులు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జవహర్, ఏపీ టూరిజం కౌన్సిలర్ సభ్యులు షాకీర్, నాయకులు కాలనీ చిన్న, నాగరాజనాయక్, అబీద్, మునీర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగరాజనాయక్, హౌసింగ్ ఏఈ బాలాజీ నాయక్, ఈవో ప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలను వినియోగించుకోవాలి



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి

మదనపల్లె : వేసవిలో దాహం తీర్చేందుకు పట్టణంలోని పలు కూడళ్లలో, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాలను ప్రజలు వినియోగించుకోవాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి, చైర్‌పర్సన్ మనూజారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని బెంగళూరు బస్టాండ్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆర్డీఓ ప్రారంభించారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందుకు వచ్చిన రెడ్‌క్రాస్ సభ్యులను అభినందించారు. అలాగే మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని చైర్‌పర్సన్ మనూజారెడ్డి, కమిషనర్ కే.ప్రమీల ప్రారంభించారు. వేసవి ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. వీటితో పాటుగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జనసామర్థ్యం ఉన్న ప్రాంతాల్లో మరిన్ని చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, డీఈ బండపల్లిశిరీషా, ఏఈ స్నేహప్రియ, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు డి.ఆర్.జగదీష్, తహసీల్దార్ సీకే.శ్రీనివాసులు, కౌన్సిలర్ పాల్‌చంద్రశేఖర్, మౌలా, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



నియామక పత్రాలను అందుకుంటున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

వాల్మీకిపురం: అంగన్‌వాడీల్లో పని చేసే కార్యకర్తలు పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన నూతనంగా ఎంపిక అయిన 11 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు ఎమ్మెల్యే చేతులమీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని అంగన్‌వాడీల్లో పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. అంగన్‌వాడీలు వందశాతం నిరుపేద పిల్లలకు అందించి వారి అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీడీపీఓలు భారతి, రాజమ్మ, నాయకులు నీళ్లభాస్కర్, రాయుడు, వెంకట రెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా కార్పెంటర్ల దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న కార్పెంటర్లు

పీలేరు రూరల్ : పీలేరు కార్పెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్పెంటర్స్ దినోత్సవంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మరమ్మతులకు గురైన కిటికీలు, తలుపులు, తదితర మరమ్మతు పనులు ఉచితంగా చేపట్టారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్పెంటర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబికాపతి ఆచారి మాట్లాడుతూ కార్పెంటర్లు వివిధ సమస్యలతో జీవనం సాగిస్తున్నారని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అర్హులైన కార్పెంటర్లకు ఇళ్ల పట్టాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ మోహన్‌రెడ్డి, ఎస్‌ఐ నరసింహుడు, యూనియన్ జిల్లా కన్వీనర్ రెడ్డిబాబు, ఉపాధ్యక్షులు వి. శంకరాచారి, జిల్లా కార్యదర్శి రాజేష్ ఆచారి, గౌరవ సలహాదారులు వేణు ఆచారి, సభ్యులు రియాజ్, బాబి, మారుతి , నాగేంద్రాచారి, సురేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

జీవితానికి దర్పణం నాటకం

కురబలకోట: సామాజిక పరిస్థితులను ఎప్పటికప్పుడు చాటి చెబుతూ నాటకం మానవ జీవితానికి దర్పనంగా నిలిచేదని అంగళ్లు మిట్స్ ఇంజినిరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ పేర్కొన్నారు. ప్రపంచ నాటక (రంగస్థల) దినోత్సవ సందర్భంగా సోమవారం కళాశాలలో ఫిల్మ్ మేకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మూవీ క్విజ్, స్క్రిప్ట్ రైటింగ్, డైలాగ్, మిమ్స్, యాక్టింగ్, రంగ స్థలం తదితర వాటిపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఒక రాజు లేదా నాయకుడు ఆ ప్రాంతంలో చెల్లుతాడు..అదే కళాకారుడు ఎక్కడైనా రాణించడానికి అవకాశం ఉందన్నారు. ఆయన మాట్లాతడుతూ టీవీ, సినిమా నాటకాన్ని మసకబార్చిందన్నారు. తిరిగి ప్రాభవాన్ని చాటాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహం కూడా ఎంతైనా అవసరమన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమిస్తాం

తంబళ్లపల్లె: ఎస్సీ వర్గీకరణ సాధించుకునే వరకూ ఉద్యమిస్తామని మహాజన సోషలిస్టు పార్టీ (ఎమ్మార్పీఎస్) నియోజకవర్గ ఇన్‌చార్జ్ దుమ్ము చిన్న తెలిపారు. సోమవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందక్రిష్ణమాదిగ పిలుపు మేరకు మాదిగలు చేపట్టిన సంగ్రామ పాదయాత్ర సోమవారం తంబళ్లపల్లె మండలంలో సాగింది. బీజేపీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేస్తామని నమ్మించి మోసం చేయడం దారుణమన్నారు. 9 ఏళ్లు గడుస్తున్న ఇప్పటికీ ఎస్సీ వర్గీకరణపై స్పందించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మల్లికార్జున, ఎర్రప్ప,ఎమ్మార్పీఎస్ నాయకులు మధు, శ్రీరాములు, భాస్కర్, గోపిదిన్నె మల్లికార్జున పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 26 మంది ఎంపిక

పీలేరు : స్థానిక ఎంజేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 26 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ అవినాష్‌కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఎంజేఆర్ కళాశాలలో ఐఎల్‌ఎం కంపెనీ ఆధ్వర్యంలో హెచ్‌ఆర్ గౌస్ బాషా విద్యార్థులను మూడు దశలలో పరీక్షించారు. మొదటి రౌండ్‌లో కమ్యూనికేషన్ స్కిల్స్‌కు 145 మంది అభ్యర్థులు హాజరు కాగా రెండవ గ్రూపు డిస్కషన్‌కు 42 మంది ఎంపికైనట్లు తెలిపారు. మూడో దశలో 26 మందిని ఎంపిక చేసినట్లు వివరించారు.

ఎనిమిది మంది డిబార్

పెద్దమండ్యం: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతున్న 8 మంది విద్యార్థులను సోమవారం సిటింగ్‌స్క్వాడ్ డిబార్ చేసినట్లు ప్రిన్సిపల్ రామాంజులునాయక్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఫిజిక్స్ 2 పేపర్ పరీక్షలకు 239 మంది విద్యార్థులకు గాను 237 మంది హాజరైనట్లు తెలిపారు.

మాతా, శిశు మరణాలను నివారించడమే లక్ష్యం

పెద్దతిప్పసముద్రం: మాతా, శిశు మరణాలను నివారించడమే లక్ష్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయరాణి అన్నారు. సోమవారం మండలంలోని కమ్మచెరువు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్యం, ఆహార నియమాలు, తల్లీ, బిడ్డకు అందించే పోషకాల విలువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెరువు నరసమ్మతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కమ్మచెరువు పంచాయతీ మొరుసుపల్లిలో నెలకొన్న తాగునీటి సమస్యపై సర్పంచ్ చెరువు నరసమ్మ, పంచాయతీ అధికారులు స్పందించారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రజల సౌకర్యార్థం గ్రామంలో కొత్తగా పైప్‌లైన్ వేయించి నీటి సమస్యను పరిష్కరించారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నేటి నుంచి నవమి ఉత్సవాలు

మదనపల్లె సిటీ: స్థానిక బీటీ కాలేజీ మైదానం వద్దనున్న వరాల ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభంకానున్ననట్లు ఆలయ కమిటీ సభ్యులు సాయి ప్రతాప్ తెలిపారు. సోమవారం ఆలయంలో నవమి ఉత్సవ వేడుకల పోస్టర్లను ఆవిష్కరించారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి

- స్పందనలో సబ్‌కలెక్టర్‌కు మదనపల్లె అభివృద్ధి వేదిక వినతి
- సర్వే సమస్యలపై వెల్లువెత్తిన వినతులు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : పట్టణంలో రోజురోజుకీ పెరుగుతున్న జనాభాతో పాటు వాహనాల వినియోగం పెరిగిపోవడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడి తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని, పరిష్కారానికి కృషిచేయాల్సిందిగా మదనపల్లె అభివృద్ధి వేదిక సభ్యులు ఆర్డీఓ, మున్సిపల్ చైర్‌పర్సన్‌కు విన్నవించారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాలకు చెందిన ప్రజలు తమ సమస్యలపై సబ్‌కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. పట్టణంలో రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించి, మురుగునీటి కాలువలపై ఫుట్‌పాత్‌లు నిర్మించాలని, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుతో పాటుగా ట్రాఫిక్ సిగ్నల్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేయాలని మదనపల్లె అభివృద్ధి వేదిక సభ్యులు ఆర్డీఓను కోరారు. చేపల మార్కెట్‌ను డైలీ మార్కెట్‌లోకి, డైలీ మార్కెట్‌ను వారపుసంతలోకి, వారపుసంతను టమాటా మార్కెట్ యార్డులోకి, టమాటా మార్కెట్‌ను పట్టణ వెలుపల ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌకర్యవంతంగా ఉండి ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుందని సభ్యులు శ్రీనివాసులు, హరిశర్మ, కృష్ణమూర్తి, నరసింహులు, ఎం.ఏ.బాషా, గొల్లపూడిమారుతిరావు, ప్రభాకరరెడ్డి తదితరులు తెలిపారు. పీటీఎం మండలం రంగసముద్రం విసనకర్రవాండ్లపల్లెలో సర్వేనెం.436/2లోని 0.70 సెంట్ల భూమి వందేళ్లుగా తన అనుభవంలో ఉంటూ పక్కా రికార్డులు కలిగి ఉన్నప్పటికీ మడిమూరి గ్రామానికి చెందిన ఆదిరెడ్డి దౌర్జన్యంగా ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నాడని కే.రామచంద్ర ఫిర్యాదు చేశారు. భూమిని సర్వే చేయాల్సిందిగా రెండేళ్లుగా సర్వేయర్ చుట్టూ తిరుగుతున్నా రాకపోగా, పైపెచ్చు చలానా కట్టవద్దని చెపుతున్నాడని తెలిపారు. దీంతో స్పందించిన ఆర్డీఓ ఫోన్‌ద్వారా సర్వేయర్‌ను భూమి సర్వే చేయాల్సిందిగా ఆదేశించారు. మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీలోని సర్వేనెంబర్లు.503, 783, 785, 789,790,791, 803లలో తనకు రావాల్సిన భాగాన్ని సర్వే జరిపి స్వాధీనపరచాల్సిందిగా రామసముద్రం మండలం చెంబకూరు గ్రామం దిగువపల్లెకు చెందిన కే.గోపాలు విన్నవించారు. కోళ్లబైలు పంచాయతీ సర్వేనెంబర్.551/2లో తనకు కేటాయించిన ప్లాట్‌నెం.123లో ఇల్లు కట్టుకుంటుంటే కుమారపురంకు చెందిన గోవిందు అడ్డుకుని దౌర్జన్యం చేస్తున్నాడని చుక్కల తండాకు చెందిన రామునాయక్, సుజాతమ్మ ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీలో జరిగిన స్పందనలో ఎస్‌బీఐ కాలనీ రీడింగ్‌రూమ్‌కు దినపత్రికలు వేయించాలని, కుక్కల బెడదను తొలగించాలని ఎస్‌బీఐ కాలనీ అసోసియేషన్ సభ్యులు చైర్‌పర్సన్ మనూజారెడ్డి, కమిషనర్ కే.ప్రమీలకు ఫిర్యాదు చేశారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దడం బాధ్యత



శిక్షణ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ శ్రీదేవి

కలకడ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం నెరవేరే విధంగా స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌లో అందరు భాగస్వాములై స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దే బాధ్యత మన అందరిపై ఉందని ఎంపీపీ శ్రీదేవి అన్నారు. సోమవారం కలకడలో జరిగిన క్లాప్‌మిత్రాల ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. గాలివీడు మండలం నుంచి హాజరైన పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్, వెటర్నిటీ, డిజిటల్ అసిస్టెంట్‌లకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో సేంద్రీయ ఎరువుల తయారీకి, చెత్త సేకరణ ముఖ్యమన్నారు. ప్రతి ఇంటి నుంచి తడి-పొడిచెత్తను వేరుగా సేకరించి స్థానికంగా సేంద్రీయ ఎరువుల ఉత్పత్తిని పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నారాయణ, సర్పంచ్ ప్యారీజాన్, పంచాయతీ కార్యదర్శులు నందిని, శివాజీ, వైఎస్సార్‌సీపీ నాయకులు షావత్‌అల్లీఖాన్, జిలానీ పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఖాజాబీ

గుర్రంకొండ: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో చలివేంద్రాలను ఏర్పాటు చేయించాలని తహసీల్దార్ ఖాజాబీ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వేసవి కాలంలో ఎండలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రతి వీఆర్వో తమ సచివాలయ పరిధిలోని జనచంచారం ఎక్కువగా ఉన్న గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద తప్పనిసరిగా చలివేంద్రాలను ఏర్పాటు చేయించాలన్నారు. వడగాలలుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సచివాలయాల్లో అత్యవసర ప్రథమ చికిత్సా కిట్లను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. డీటీ శ్రీనివాసరావ్, ఆర్‌ఐ చంద్రశేఖర్, వీఆర్వోలు నాగరాజ, అన్వర్, రమేష్, రెడ్డిశేఖర్, కోటిరెడ్డి, ప్రసాద్, వెంకటరమణ పాల్గొన్నారు.

వర్షపునీటిని కాపాడుకుందాం



రెయిన్ వాటర్ హార్వేస్టింగ్ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

కేవీపల్లె : వర్షపు నీరు వృథా కాకుండా కాపాడుకుందామని గ్యారంపల్లె ఏపీ రెసిడెన్షియల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నకేశవులు అన్నారు. గ్యారంపల్లె ఏపీఆర్‌జేసీలో ఐసీఐసీఐ ఫౌండేషన్ వారు రూ. 2.50 లక్షలతో రెయిన్ వాటర్ హార్వేస్టింగ్ సిస్టెమ్ (వర్షపునీరు సంరక్షణా పథకం)ను ఏర్పాటు చేశారు. సోమవారం ఈ పథకాన్ని పారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసీఐసీఐ ఫౌండేషన్ వారు పైపులైను సిస్టమ్, హ్యాండ్ బోరు, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వర్షపునీటిని బోరుపంపు బావిలో సంరక్షించి ఆ నీటిని విద్యార్థులు బట్టలు ఉతుక్కోవడానికి, ఆకు కూరలు సాగు చేసుకోవడానికి ఉపయోగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డెప్ప, ఎంపీటీసీ సూర్యనారాయణరెడ్డి, ఐసీఐసీఐ ఫౌండేషన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎం. రాజేశ్వరి, ఏపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్, అధ్యాపకులు భూపతి, వెంకటరమణ, హరి, రమేష్, బలరాం, వెంకటేశ్వర్లు, నరేంద్ర, అన్నపూర్ణ, సౌజన్య, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పోషణ్ పక్వాడ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది

ములకలచెరువు: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారం తీసుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల, సర్పంచ్ సునీత, ఎంపీటీసీ శ్రీనివాసులరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వేపూరికోట అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలతో తయారు చేసిన పలు రకాల వంటలను ప్రదర్శించారు. అనంతరం చిరుధాన్యాలతో వంటలు తయారు చేసిన అంగన్‌వాడీ కార్యకర్త వెంకటరమణమ్మను వారు అభినందించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం పద్మా, మహిళా పోలీస్ అపర్ణ తదితరులు ఉన్నారు.

పట్టా భూమి స్వాధీనానికి రెవెన్యూ అధికారుల యత్నం

–గుంతవారిపల్లెదిన్నె గ్రామంలో ఉద్రిక్తత

రామసముద్రం: నిరుపేదలకు ఇచ్చిన దరఖాస్తు పట్టా భూమి స్వాధీనానికి రెవెన్యూ అధికారులు, పోలీసులు సోమవారం హడావిడి చేశారు. బాధితుల వివరాల మేరకు రామసముద్రంమండలం మినికి పంచాయతీ పరిధిలోని గుంతవారిపల్లెదిన్ని గ్రామానికి చెందిన మేకల బయ్యన్నకు సర్వేనెంబరు 377/1లో 1.06 ఎకరాల పట్టా భూమి ఉంది. ఇందులో 10 సెంట్ల భూమిని తన అనారోగ్య అవసరాలకై అమ్ముకున్నాడు. ఈ గ్రామ పొలిమేరలో గ్రామదేవత ఒడిసెలమ్మ ఆలయం ఉంది. ఈ ఆలయానికి పక్కనే బయ్యన్న భూమి ఉంది. కాగా దరఖాస్తు పట్టా నిబంధనలకు విరుద్ధంగా బయ్యన్న భూమిని విక్రయించాడని అతని పట్టా రద్దు చేసి ఆ భూమిని ఆలయానికి దారి కోసం కేటాయించాలని అదేగ్రామానికి చెందిన విశ్వనాథరెడ్డి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం ఉదయం తహసీల్దార్ దైవరాజన్ మండలంలోని వీఆర్‌వోలు, వీఏవోలు , పోలీసులతోపాటు ఎస్‌ఐ భూమి స్వాధీనం కోసం దిన్నిగ్రామానికి చేరుకుని జేసీబీతో రోడ్డు వేయడానికి ప్రయత్నం చేశారు. అయితే గ్రామస్తులందరూ ఏకమై ఎదురు తిరిగి నిరసన తెలిపారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

తంబళ్లపల్లె: మండలంలో జగనన్న ఇళ్లనిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేందుకు హౌసింగ్ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీఓ ఆనంద్‌కుమార్ ఆదేశించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం జరిగింది. ప్రజా సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు.